
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు

శుక్రవారం 9 మే 2025





నిందితులను జైలుకు తరలిస్తుండగా బయటి నుంచి రోదనలు

జంట హత్యల కేసులో 11 మందికి జీవిత ఖైదు

వైసీపీ నాయకుడు, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్య కేసులో కర్నూలు జిల్లా కోర్టు గురువారం సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా న్యాయాధికారి కబర్డి సంచలన తీర్పు వెల్లడించారు. కృష్ణగిరి మండలంలో వైసీపీ నేత చెరుకులపాడు నారాయణ రెడ్డి, ఆయన అనుచరుడు బోయ సాంబశివుడు ఎనిమిదేళ్ల క్రితం 2017 మే 21వ తేదీన హత్యకు గురయ్యారు. ఈ జంట హత్య కేసులో మొత్తం 19 మంది నిందితులు కాగా వారిలో 29 మంది సాక్షులను విచారించిన కోర్టు... ఐదుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. ఇదే కేసులో గతంలో ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్లను గతంలోనే న్యాయస్థానం ఆదేశాల మేరకు చార్జిషీట్ నుంచి తొలగించారు. ఏ4గా ఉన్న కోతుల రామాంజనేయులు కేసు విచారణ దశలో మృతి చెందాడు. మిగిలిన 11 మందికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. తీర్పు నేపథ్యంలో నిందితుల బంధువులు, చెరుకులపాడు గ్రామస్థులు వందలాదిగా జిల్లా కోర్టు వద్దకు చేరుకున్నారు. జీవిత ఖైదు శిక్ష పడిందని తెలియడంతో ఒక్కసారిగా కోర్టు ఆవరణం నిందితుల బంధువులు, కుటుంబీకుల రోదనలతో మార్మోగింది. జీవిత ఖైదు పడిన వారిని పోలీసులు వాహనంలోకి ఎక్కిస్తుండగా.. ఒక్కసారిగా వారి భార్యపిల్లలు వారిని చూసి ఆక్రందనలు చేస్తూ పోలీసు వాహనానికి ఎదురొచ్చారు. దీంతో ఎస్కార్ట్ పోలీసులు చొరవ చూపి వాహనం వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో నిందితులను పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

\- కర్నూలు లీగల్ (ఆంధ్రజ్యోతి)



బిడ్డను చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్న నిందితుడి కుటుంబ సభ్యులు







ఓరి భగవంతుడా... (కుమారుడితో రోదిస్తున్న నిందితుడి కుటుంబ సభ్యులు)




అయ్యో.. దేవుడా..! (నిందితుడి తండ్రి ఆవేదన)



ఎట్ల స్వామీ బతికేది... (నిందితుడి భార్య రోదన)

- చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్యకేసు..
- నిర్దోషులుగా ఐదుగురు
- రోదనలతో మిన్నంటిన కోర్టు ఆవరణం
- హత్య జరిగిన 8 ఏళ్లకు శిక్ష ఖరారు
- కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు



చెరుకులపాడు నారాయణరెడ్డి (ఫైల్)

వివరాలు 7లో

ఉత్కంఠ భరితం..

నందికొట్కూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన సభ ఉత్కంఠ భరితంగా సాగింది. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సభ జరిగింది. ఈ సభకు నోడల్ ఆఫీసర్‌గా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వ్యవహరించారు. ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణ, రూరల్ సీఐలు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ భద్రతను ఏర్పాటుచేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు. కార్యాలయం ముందున్న దుకాణాలను బంద్ చేయించారు. ఉదయం 11గంటలకు సభ ప్రారంభం కాగానే మొదట మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆధ్వర్యంలో ఆయన వర్గంలోని 16మంది కౌన్సిలర్లు ప్రత్యేక వాహనాల్లో అక్కడి చేరుకున్నారు. అనంతరం మరో కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్ హాజరయ్యారు. దీంతో మొత్తం 18 మంది కౌన్సిలర్లు సభకు హాజరయ్యారు. అయితే ఎంపీ డా.బైరెడ్డి శబరి వర్గానికి చెందిన తొమ్మిది మంది కౌన్సిలర్లు, వైసీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే మొత్తం సభ్యుల్లో 2-3 కౌన్సిలర్లు హాజరైతేనే కోరం ఏర్పడుతుంది. ఈ దమాషా ప్రకారం 29 మంది కౌన్సిలర్లలో 20 మంది కౌన్సిలర్లు హాజరు కావాల్సి ఉంది. సభ నిర్వహణకు ఇంకా ఇద్దరు కౌన్సిలర్లు తక్కువగా ఉండడంతో 11.30 గంటలకు సభను 12 గంటలకు వాయిదా వేశారు. 12 గంటలకు తిరిగి సభ ప్రారంభం కాగానే 17 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరయ్యారని, దీంతో కోరం లేకపోవడంతో చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం లేదని అందువల్ల సభను ముగిస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి తెలిపారు. ఆ సమయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానంను మరో 15 రోజుల్లో ప్రవేశపెట్టేందుకు అవకాశం కల్పించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను కోరారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, చైర్మన్, కౌన్సిలర్లు

- ప్రత్యేక వాహనాల్లో కౌన్సిలర్ల తరలింపు
- కోరం లేక ముగిసిన అవిశ్వాస తీర్మానం
- భారీ భద్రత, 144 సెక్షన్ అమలు
- మినిట్స్‌ను కలెక్టర్‌కు పంపుతాం: ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి
- సభకు హాజరైన వారంతా టీడీపీ కౌన్సిలర్లే: ఎమ్మెల్యే గిత్తా
- చైర్మన్‌గా కొనసాగనున్న దాసి సుధాకర్‌రెడ్డి
- ఎంపీ వర్గీయుల సంబరాలు

మిగతా 7వ పేజీలో

డీఈవోకు విద్యార్థుల జాబితా

నంద్యాల ఎడ్యుకేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆదర్శపాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థుల జాబితాను మోడల్ స్కూల్స్ నంద్యాల జిల్లా కన్వీనర్ డాక్టర్ ఇష్రత్‌బేగం డీఈవో జనార్ధన్‌రెడ్డికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇష్రత్ బేగం మాట్లాడుతూ జిల్లాలోని ఇరవై ఆదర్శ పాఠశాలలకు సంబంధించి ఆరో తరగతి ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షలో క్వాలిఫై అయిన విద్యార్థులకు రోస్టర్ కం మెరిట్ ఆధారంగా ఎంపిక, పరిశీలన కార్యక్రమం పూర్తిచేశామన్నారు. ఉన్నతాధికారుల అనుమతి కోసం డీఈవోకు పూర్తయిన జాబితాను అందజేసినట్లు తెలిపారు.



ఎంపికైన విద్యార్థుల జాబితాను డీఈవోకు అందజేస్తున్న మోడల్‌స్కూల్స్ జిల్లా కన్వీనర్

కలెక్టర్‌కు 'రెడ్‌క్రాస్' అవార్డు

నంద్యాల హాస్పిటల్, మే 8 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ అభివృద్ధికి విశేష సేవలందించిన కలెక్టర్ రాజకుమారి గణియా గవర్నర్ నుంచి అవార్డు పొందారు. గురువారం అమరావతిలోని రాజ్‌భవన్‌లో జరిగిన ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవంలో గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్‌నజీర్, ప్రథమ మహిళ సమీరా నజీర్ చేతులమీదుగా కలెక్టర్ రాజకుమారి గవర్నర్ అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్‌ను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌క్రాస్ అభివృద్ధికి సేవలందించిన ఎనిమిది మంది కలెక్టర్లకు ఈఅవార్డును గవర్నర్ అందజేశారు. అందులో నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియా అవార్డును పొందడం విశేషం. కార్యక్రమంలో నంద్యాల రెడ్‌క్రాస్ చైర్మన్ పర్ల దస్తగిరి పాల్గొన్నారు.



గవర్నర్ నుంచి గోల్డ్‌మెడల్‌ను అందుకుంటున్నకలెక్టర్ రాజకుమారి

అకాలవర్షం

- నేలకొరిగిన మొక్కజొన్న, కొర్ర, నువ్వు పంటలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు
- కూలిన విద్యుత్ స్తంభాలు
- కరెంటు సరఫరాలో అంతరాయం
- పిడుగుపాటుకు నాలుగు బర్రెలు మృతి

చాగలమర్రి/ కొలిమిగుండ్ల/ అవుకు/ సంజామల, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, కొర్ర, నువ్వు పంటలు నేలకొరిగాయి. చాగలమర్రి మండలంలోని పలు గ్రామాల్లోని వీధులు వర్షపు నీటితో జల మయమయ్యాయి. గొడిగనూరు, శెట్టివీడు పంట పొలాల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న, కొర్ర ధాన్యం తడిచింది. రైతులకు నష్టం వాటిల్లింది. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో గాలివాన బీభత్సానికి పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా మారాయి. కల్వటాల, బెలుం గుహలు, పెట్నికోట, కొలిమిగుండ్ల గ్రామాల్లో 11 విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మీర్జాపురం గ్రామం అంధకారంలోనే ఉండిపోయింది. గాలి వాన కారణంగా దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, లైన్లు సరి చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణస్వామి వెల్లడించారు. కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురంలో బుధవారం రాత్రి పిడుగు పాటుకు నాలుగు బర్రెలు మృతిచెందాయి. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని రైతు వెంకటక్రిష్ణుడు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తిచేశాడు. అవుకు మండలంలో రైతులు వరి, మిరప, మొక్కజొన్న పంటలను కోసి కల్లాల్లో, రోడ్ల పక్కన నిల్వ చేసుకున్నారు. సాయంత్రం కాగానే ఆకాశం మబ్బులు కమ్ముకొని వర్షం పడుతుండటంతో రైతులు ధాన్యంపై టార్పాలిన్ పట్టాలను కప్పి కాపాడుకుంటున్నారు. ధాన్యం తడిస్తే వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దబోదనం, గొట్లూరు గ్రామాల్లోని పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. 4 విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. సంజామల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గురువారం తెల్లవారుజామున 2గంటలకు విద్యుత్ సరఫరా చేశారు. కాగా గాలి వాన బీభత్సానికి ఆకుమళ్ల సబ్‌స్టేషన్ నుంచి బొందలదిన్నె, వసంతాపురం, హోత్రమాన్‌దిన్నె, నట్లకొత్తూరు, కమలపురి గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసే స్థంభాలు నేలకొరిగాయి. ఈ ఐదు గ్రామాలు గురువారం రాత్రి వరకు విద్యుత్ సరఫరా కాలేదు. పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



చింతలచెరువులో నేలకొరిగిన మొక్కజొన్న



కొలిమిగుండ్లలో మృతి చెందిన బర్రెలు



అవుకులో టార్పాలిన్ పట్టాలతో వరి ధాన్యాన్ని కప్పిపెట్టుకున్న రైతులు



కమలపురి, బొందలదిన్నె గ్రామాల మధ్య నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మిడుతూరులో 46.4 ఎంఎం వర్షపాతం

నంద్యాల ఎడ్యుకేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల గురువారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. మిడుతూరు మండలంలో అత్యధికంగా 46.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. గడివేముల 30.2, కొలిమిగుండ్ల 21.0, ఉయ్యాలవాడ 18.8, సంజామల 16.2, పాణ్యం 14.2, చాగలమర్రి 14.2, బండిఆత్మకూరు 14.0, ఆత్మకూరు 11.4, రుద్రవరం 11.2, కొత్తపల్లె 10.4, వెలుగోడు 10.2, అవుకు 10.2, మహానంది 8.2, శ్రీశైలం 8.2, పాములపాడు 6.2, జూపాడుబంగ్లా 5.8, ఆళ్లగడ్డ 4.6, శిరువెళ్ల 4.0, నందికొట్కూరు 3.2, దొర్నిపాడు 2.4, కోవెలకుంట్ల 2.2, నంద్యాల 2.0 ఎంఎం వర్షపాతం నమోదైంది.

ముగ్గురు ఎఫ్‌ఏల సస్పెండ్

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టివీడు, పెద్దవంగలి, నేలంపాడు గ్రామాల్లో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి పనిదినాలు కల్పించడం, విధుల్లో అలసత్వం, వివిధ కారణాలతో వారిని విధుల నుంచి తొలగించారు. కొత్తవారిని నియమించే వరకు టీఏలు ఎఫ్‌ఏ బాధ్యతలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

కోర్టులకు వేసవి సెలవులు

నంద్యాల క్రైం, మే 8 (ఆంధ్ర జ్యోతి) : నంద్యాల జిల్లాలోని కోర్టులకు ఈనెల 12 నుంచి జూన్ 13 వతేదీ వరకు వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి కబర్డి గురువారం కర్నూలు నుంచి ఉత్తర్వులు అందాయి. కర్నూలు ఆదోని, నంద్యాల, ఆళ్లగడ్డ అత్యవసర కేసుల కోసం ఇద్దరు న్యాయాధికారులను నియమిస్తున్నట్లు కోర్టు అధికారులు తెలిపారు. కర్నూలు ఏడీ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి లక్ష్మీరాజ్యం 15 రోజులపాటు ఆ కోర్టులో అందుబాటులో ఉంటారన్నారు. నంద్యాల 13, 19, 23 ఆళ్లగడ్డ సబ్ కోర్టులో 14, 20తేదీల్లో న్యాయాధికారి ఉంటారన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల నియంత్రణ: ఎస్పీ



నంద్యాల టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించొచ్చని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. గురువారం రామకృష్ణ పీజీ కళాశాలలో రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా నేర స్థలంలో సాక్ష్యాధారాలు సేకరణ వాటి భద్రతా ప్రమాణాలు ఎలా పాటించాలి అనే విషయాలపై శ్రద్ధ ఉంచాలన్నారు. కేసుల దర్యాప్తు విషయంలో తప్పుదోవ పట్టించేందుకు నేరగాళ్లు సాంకేతికంగా కొత్త పద్ధతులు ఉపయోగిస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొవాలన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ తరగతులు అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వారితో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా నేర పరిశోధన సమయంలో ఆమోదయోగ్యమైన సాక్ష్యం, నేర ప్రక్రియ, వంటి చట్టపరమైన ప్రమాణాలు పాటించాలన్నారు. డీఎన్‌ఏ విశ్లేషణ వేలిముద్రలు, రక్తపు మరకల నమునాలు, తుపాకీలు, బాలిస్టిక్స్, టాక్సికాలాజీ, మైక్రోస్కోపి, అగ్ని శిథిలాల విశ్లేషణ వంటి వాటిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సాక్షాధారాలు సేకరించాలని సూచించారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని కేసుల్లో మంచి పురోగతి సాధించాలన్నారు. ఈ శిక్షణా తరగతులకు సీఐలు, స్టేషన్ రైటర్లు వచ్చారు. కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మంద జావళి, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, ఫోరెన్సిక్ సైన్స్ అసిస్టెంట్‌లు డాక్టర్ అసింబాషా, డా.కష్ణకుమార్‌రెడ్డి, శ్యాంప్రసాద్, కుమారస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన పోరాటం



నంద్యాల ఎడ్యుకేషన్, మే 8 (ఆంధ్రజ్యోతి): అతిథి అధ్యాపకుల(గెస్ట్ ఫ్యాకల్టీ) పోరాటం ఫలించింది. నెలకు రూ.10వేల చాలీచాలని వేతనంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీలుగా పని చేస్తున్న అధ్యాపకులు పదేళ్లుగా వేతనం పెంపుకోసం పోరాడుతూనే ఉన్నారు. వారికష్టాన్ని మంత్రి నారాలోకేశ్ ఆరాతీసి వారి కుటుం బాలకు అండగా నిలబడ్డారు. ఏకంగా రూ.10వేల నుంచి రూ.27వేల వరకు వేతనాన్ని పెంచి గెస్ట్ ఫ్యాకల్టీలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గెస్ట్ ఫ్యాకల్టీలకు ప్రస్తుతం గంటకు రూ.150 చొప్పున గరిష్ఠంగా రూ.10వేలు ఇవ్వాలనే నిబంధన అమల్లో ఉంది. మంత్రి చొరవతో ఇకపై గెస్ట్ ఫ్యాకల్టీలకు గంటకు రూ.375 చొప్పున గరిష్ఠంగా నెలకు రూ.27,000 వేతనాన్ని చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమో దం తెలుపుతూ ఉత్తర్వులు జారీచేసింది. దీనిద్వారా నంద్యాల జిల్లాలో వివిధ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేస్తున్న 54మంది లబ్ధి పొందనున్నారు.

అధ్యాపకుల సేవలు పునరుద్ధరణ

ఏపీలోని ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో మొత్తం 3,572 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఉండగా, నంద్యాల జిల్లాలో 130 మంది పనిచేస్తున్నారు. వారి సేవలు ఏప్రిల్‌తోనే ముగిశాయి. కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసులను పునరుద్ధరిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 2024 మే నెలలో పనిచేసిన కాలానికి జీతం చెల్లించడానికి మంత్రి నారాలోకేశ్ సుముఖత తెలపడంపై అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అతిథి అధ్యాపకులకు పెరిగిన వేతనం
- రూ.10వేల నుంచి రూ.27వేలకు పెంపు
- హర్షం వ్యక్తంచేస్తున్న అధ్యాపకులు
- మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు

కరుణించిన ప్రభుత్వం



చాలీచాలని వేతనంతో ఇబ్బంది పడుతూ పదేళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నాం. నేడు రాష్ట్ర ప్రభుత్వం కరుణించి వేతనాన్ని పెంచడం సంతోషంగా ఉంది. -పీకే నాగరావు, గెస్ట్ అధ్యాపకుడు, మిడ్తూరు

ఫలించిన నిరీక్షణ



ఎన్నో యేళ్లుగా వేతనపెంపునకు పోరాటం చేశాం. ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. అనేక మంది విద్యాశాఖాధికారులను కలిసినా ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. నేటికి మా నిరీక్షణ ఫలించింది. -విజయభాస్కర్, గెస్ట్ అధ్యాపకుడు, పాములపాడు

రూ. 150 నుంచి రూ. 375కు పెంచడం..



తమ కష్టాన్ని గుర్తించిన మంత్రి నారాలోకేశ్ తమకు ఒక్కసారిగా గంటకు రూ.150ల వేతనం నుంచి రూ.375లకు పెంచడం హర్షనీయం. మంత్రికి, ప్రభుత్వానికి మా కుటుంబాలంతా రుణపడివున్నాయి. - వెంకటేశ్వర్లు, గెస్ట్ అధ్యాపకుడు, మిడ్తూరు

నాణ్యమైన విద్యను అందించడానికి..



అధ్యాపకుల కుటుంబాల్లో ఒడిదుడుకులు లేకుండా చేసేలా వేతనాలను పెంచడం హర్షనీయం. ఇలాంటి విధానాలు మరింత నాణ్యమైన విద్యను అందించడానికి తోడ్పాటునందిస్తుంది. -శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ అధ్యాపకుల అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు

మంచి ఫలితాలకు దారితీస్తాయి



రానున్న విద్యాసంవత్సరానికి కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును మరో 11నెలలు పునరుద్ధరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. విద్యపై ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు మంచి ఫలితాలకు దారితీస్తాయి. -కిశోర్‌కుమార్, కాంట్రాక్ట్ అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

త్వరలో జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు: కలెక్టర్

నంద్యాల హాస్పిటల్, మే 8(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఇటీవల అధునాతన వసతులతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజి సెంటర్‌ను ప్రారంభించామని, త్వరలోనే రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు అత్యంత తక్కువ ధరకు మందులు లభ్యమయ్యేలా జనరిక్ మెడికల్ షాపు త్వరలో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. యూత్ బ్లడ్‌క్రాస్‌ను బలోపేతం చేసి అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా రెడ్‌క్రాస్ ఆర్మీని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తయారు చేస్తామన్నారు. మత్స్యకారులకు, చెంచు కుటుంబాలకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా ఇంటింటికి వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ల డిమాండ్లను నెరవేర్చాలని ఏపీ హంస జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ఆత్మకూరు తాలుకా అధ్యక్షుడు కరుణాకర్ కోరారు. గురువారం ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలని, వైద్యశాఖలో కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు చేయడంతో పాటు రెండేళ్ల పూర్తయిన కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యూలర్ చేయాలని అన్నారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో ఏఎన్ఎంలు పనిచేయగా ఎంఎల్‌హెచ్‌కు, సీహెచ్‌వోలకు పారితోషికం పడుతోందని ఆ మొత్తాన్ని హెల్త్ అసిస్టెంట్‌లకే ఇవ్వాలని అన్నారు. హెల్త్ అసిస్టెంట్లపై దురుసుగా మాట్లాడిన సీహెచ్‌వోలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పూర్వపు సబ్ సెంటర్ల వ్యవస్థను మళ్లీ తీసుకురావాలని, సచివాలయం ఏఎన్ఎంలను మాతృ సంస్థలోకి విలీనం చేసి వారి జీతాలను వైద్యాధికారి ద్వారా జరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగశేషు, రహంతుల్లాఖాన్, మాలిబాషా, ధనలక్ష్మి, రమణమ్మ, సుంకమ్మ, రత్నమ్మ, సామక్క తదితరులు ఉన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న క్రీడాభివృద్ధి అధికారి

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు సూచించారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని కేవీకే స్టేడియం నందు నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు, పిల్లలు సమయాన్ని వృథా చేసుకోకుండా క్రీడలపై మక్కువ చూపాలన్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి క్రీడాకారులకు అవసరమైన సహకారాన్ని అందించి ప్రోత్సహించడం సంతోషకర మన్నారు. అనంతరం శిక్షకులకు, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా, శిక్షకులు ఖాజాహుసేన్, నరేష్, ఉపేంద్ర, సతీష్, హరి, మహెబూబ్, తైక్వాండో, ఖోఖో క్రీడల అసోషియేషన్ అధ్యక్షులు సయ్యద్, బాబు ఉన్నారు.

గోడౌన్ తనిఖీ

నంద్యాల కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల అప్సరబార్ సమీపంలో ఉన్న నయారా ఫుడ్ బేవరేజెస్ గోడౌన్‌లో గురువారం ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటరాముడు, కాశీంవలీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు మాట్లాడుతూ ఈ గోడౌన్‌లో ఎనిమిది రకాలైన సోడాలను తయారు చేస్తున్నారు. శాంపిళ్లను స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ హైదరాబాద్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

నంద్యాలలో పోలీసుల సోదాలు



సోదాలు చేస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన బొగ్గరపు నాగరాజుపై బెంగళూరుకు చెందిన మను అనే వ్యాపారి ఇటీవల వ్యాపార లావాదేవీల విషయంలో మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ కేసు నేపథ్యంలో రెండో సారి పద్మావతిన గర్‌లోని ఇంట్లో నాగరాజు ఇంట్లో, గుమాస్తా ఇంట్లో, కార్యాలయంలో, అలాగే మరో ప్రాంతంలో మూడో పట్టణ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సంద ర్భంగా సీఐ కంబగిరిరాముడు మాట్లాడుతూ ఫిర్యాదు చేసిన మేరకు కేసు పురోగతికి తనిఖీలు చేసి విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తనిఖీలో వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, పాణ్యం సీఐ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎన్ఎండీ ఫయాజ్

నంద్యాల రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 9 నుంచి ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు 33వ వార్డు ఇన్‌చార్జి జోసఫ్, సాయి, మధు, ధనరాజ్ తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బ్రోచర్లను టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.40వేలు, ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

20న సమ్మెను జయప్రదం చేయాలి

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న చేపట్టబోవు దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ తాలుకా కార్యదర్శి ప్రతాప్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామకృష్ణ, భీషన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, రాజీవ్, శ్రీరామ్, దొరస్వామి, రూతమ్మ తదితరులు ఉన్నారు.

ఘనంగా రెడ్ క్రాస్ దినోత్సవం



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా



ఆత్మకూరు మండలంలో..

నంద్యాల హాస్పిటల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా నంద్యాల జీజీహెచ్‌లో గురువారం పండ్లు, బ్రెడ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా ముఖ్యఅతిథిగా పాల్గొని రెడ్‌క్రాస్ ఫౌండర్ జాన్‌హెన్రీ డునాంట్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జఫ్రుల్లా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో అన్ని వేళలా ముందుండి రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పేదలకు సేవచేయడం పట్ల రెడ్‌క్రాస్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఉస్మాన్‌భాషా, మండల చైర్మన్ నాగేశ్వరరెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు శ్రీను, సమీ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండల పరిధిలోని ఎస్ఆర్‌బీసీ కాలనిలోని మానవతా నిలయం వృద్ధాశ్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకుడి జన్మదినాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని ఆత్మకూరు రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు చింతలయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఉచితంగా మందులు పంపిణి చేశారు రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు రాము, హిదాయత్, వెంకటేశ్వర్లు, మగ్బుల్‌బాషా, వెంకటేష్, నగేష్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీడీవో దస్తగిరికి వినతి పత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

బండిఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఎన్నో ఏళ్లగా పని చేస్తున్న క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నమయ్య, రాజు డిమాండ్ చేశారు. గురువారం బండిఆత్మకూరు ఎంపీడీవో దస్తగిరికి సీఐటీయూ నేతృ త్వంలో ఫీల్డు అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అవిశ్వాస తీర్మానం ఎలా పెడుతారు?

- పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుంది
- ఇలాగైతే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కష్టమే
- టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

నందికొట్కూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒకే పార్టీకి చెందిన వారై ఉండి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఎలా పెడుతారని ఎమ్మెల్యే వర్గాన్ని టీడీపీ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం అవిశ్వాస తీర్మాన సభ ముగిసిన తర్వాత నందికొట్కూరులోని బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతా ఒకే పార్టీ అనుకున్నామని, కానీ చైర్మన్‌పై కొందరు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. దీని వల్ల పార్టీ ప్రతిష్ట దెబ్బతింటుందన్నారు. ఎంపీ డా.బైరెడ్డి శబరి ఆధ్వర్యంలో చేసిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులు వచ్చాయని వాటిని ఇవ్వకుండా వారి ఇంట్లో దాచిపెట్టుకున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో అవినీతి జరుగుతుందని, వాటిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కసీటు కూడా గెలుచుకోలేరని ఆయన అన్నారు. సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ మహేష్‌నాయుడు, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, డా.కాకరవాడ చిన్న వెంకటస్వామి, కౌన్సిలర్ చాంద్‌బాషా, నాగేశ్వరరావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం బహిష్కరణ



ఖాళీగా ఉన్న కుర్చీలు

గడివేముల, మే 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మలు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కానప్పుడు సర్వసభ్య సమావేశం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాంతాల్లో ప్రైవేటు కార్యక్రమాలు నిర్వహించకూడదని ప్రభుత్వం జీవో ఇచ్చిన కొందరు ప్రైవేటు సమావేశాన్ని నిర్వహించారని అన్నారు. మండలంలో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఎంపీటీసీలకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని అన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులుగా ఉంటూ గ్రామాల అభివృద్ధికి పనులు చేయలేక పోతున్నామని వాపోయారు.

కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

ఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులను మంజూరు చేయాలని తహసీల్దార్ రత్నరాధిక, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆయా గ్రామాల రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పొలం కౌలుకు చేసుకుంటున్న రైతులను గుర్తించి పంట సాగు హక్కు పత్రాలను మంజూరు చేయాలని అన్నారు.

వైభవంగా నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న భక్తులు

గోస్పాడు, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేళ్లపురి గ్రామంలో వెలిసిన యాదగిరి నరసింహస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామి జీర్ణోద్ధరణ, సంప్రోక్షణ నూతనంగా విగ్రహ గణపతి, శివలింగ, ఆంజనేయస్వామి ధ్వజశిర ప్రతిష్ఠ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ గ్రామ సర్పంచ్ కాటంరెడ్డి సుధామణి, పార్టీ మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి నరసింహస్వామి పూజలో పాల్గొన్నారు. పూజారితో ఆశీర్వాదం తీసుకున్నారు. భూమా హుశేని, సీతారామిరెడ్డి, పెద్దబుజ్జి, కోటన్న, నరసింహులు, తిరుపతి, శ్రీను తదితరులు ఉన్నారు.


ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులు, కమిటీ సభ్యులు

నంద్యాల కల్చరల్, మే 8(ఆంధ్రజ్యోతి): నంద్యా సంజీవనగర్ లో వెలసిన కోదండరామాలయంలో గురువారం భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్వర్యంలో ఆలయ 50వ సంవత్సర స్వర్ణోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఈనెల 28,29,30వతేదీలలో జరుగు మహా కుంభాబిషేక మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం రామాలయంలో అందరి దేవతలకు, ధ్వజస్తంభమునకు కళాకర్షణ కార్యక్రమాలు, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు పుష్పగిరి పీఠాధిపతులు శిష్యబృందంలో ని ముఖ్యులైన శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కలశారాధన, హోమములు నిర్వహించారు. కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్టడీ సర్టిఫికెట్‌కు వసూలు



ఫోన్ పే ద్వారా డబ్బులు పంపిన దృశ్యం

వెలుగోడు, మే 8 (ఆంధ్రజ్యోతి): స్టడీ సర్టిఫికెట్‌కు రూ.2 వేలు వసూలు చేశారని డీఎస్సీ అభ్యర్థిని ఆరోపిం చారు. వివరాలివీ.. గడివేములకు చెందిన కమలమ్మ అనే అభ్యర్థురాలు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునేందుకు ధ్రువపత్రాల సేకరణలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా ఆమె గతంలో వెలుగోడులోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో చదువుకుంది. ప్రస్తుతం ఆ పాఠశాల మూతపడింది. స్టడీ సర్టిఫికెట్ కోసం మండల విద్యాధికారి బ్రహ్మం నాయక్‌ను సంప్రదించానని, అయితే ఆ అధికారి తనకు రూ.2వేలు డిమాండ్ చేశారని ఆరోపించారు. చేసేదేమీ లేక రూ.2వేలు మండల విద్యాధికారికి ఫోన్‌పే ద్వారా చెల్లించి స్టడీ సర్టిఫికేట్ తీసుకున్నట్లు బాధితురాలు చెప్పారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ ఘటనపై ఎంఈవో బ్రహ్మం నాయక్‌ను వివరణ కోరగా.. తాను ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయలేదని, కొందరు గిట్టక తనపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ ప్రారంభం



గ్రౌండ్ ట్రూథింగ్ పనులను ప్రారంభిస్తున్న అధికారులు

కొత్తపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): ముసలిమడుగు గ్రామంలో గురువారం మండల సర్వేయర్ అనూష, శివపురం సర్పంచ్ జమీలాబి ఆధ్వర్యంలో భూరీసర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రి యను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ ద్వారా కులాలు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే 20 ఎకరాలకు నోటీసులు జారీ చేశామన్నారు. రైతులందరూ భూసర్వే సహకరించి వారి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. వీఆర్వో రామసుబ్బయ్య, మాజీ వైఎస్ ఎంపీపీ మహబూబ్ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలి

వెలుగోడు, మే 8 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మండలంలో లేఅవుట్లలో తమ సొంత స్థలాల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు సకాలంలో గృహాలు నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి నాగమునేశ్వరి అన్నారు. గురువారం ఆమె వెలుగోడు పట్టణంలోని లేఅవుట్లలో నిర్మిస్తున్న గృహాలను తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం సుగుణపాల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బీమా పరిహారం పెంచాలి

బండిఆత్మకూరు, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కూలీలకు ప్రమాద బీమా సొమ్ము రూ.5లక్షలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు డేవిడ్, మండల అధ్యక్షుడు సుబ్బరాయుడు కోరారు. గురువారం పెద్దదేవళాపురం గ్రామంలో ఉపాధి కూలీలతో వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీమా సొమ్ము కూలీలకు ప్రభుత్వమే చెల్లించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

వేలం ద్వారా రూ.5.73 లక్షల ఆదాయం

మహానంది, మే 8(ఆంధ్రజ్యోతి): బుక్కాపురం ఈశ్వర వీరభద్రస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూముల బహిరంగ వేలాల ద్వారా రూ.5.73 లక్షల ఆదాయం దేవస్థానానికి వచ్చినట్లు ఆలయ ఈవో లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం గ్రామంలోని రామాలయం ఆవరణలో నిర్వహించిన 20ఎకరాల మాన్యం భూములకు మూడేళ్ల కాలపరిమితి క్రింద బహిరంగ వేలం నిర్వహించినట్లు చెప్పారు. గతంలో నిర్వహించిన మాన్యం భూముల వేలాల కంటే రూ.2.93 లక్షలు దేవస్థానానికి అధికంగా ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తరుపున రామాంజనేయశర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

- పునరుద్ధరించిన అధికారులు

మిడుతూరు, మే 8 (ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలో బుధవారం రాత్రి బలమైన వర్షం ఈదురు గాలులకు భారీ వృక్షాలు విరిగి విద్యుత్ తీగలపై విరుచుకు పడి స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో మండల కేంద్రం మిడుతూరులో 24 గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడి రాత్రివేళలలో పిల్లలు పెద్దలు ఉక్కపోతతో తడిసి ముద్ద అయ్యారు. గురువారం ఉదయం నుంచి విద్యుత్ యంత్రాంగం, అధికారులు యుద్ధ ప్రతిపాదికన విధులు నిర్వహించి విద్యుత్ తీగలపైన మరియు రహదారులకు అడ్డంగా విరిగి పడిన చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. రాత్రి 7 గంటల సమయంలో విద్యుత్ సరఫరా కొనసాగడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మలసత్రం రైల్వే ట్రాక్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. వివరాలు.. బుధవారం రాత్రి ఆత్మహత్యకు చేసుకు ఉంటాడని, స్థానికులు స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు షర్టు, బ్లూ రంగు పంచా కట్టుకున్నట్లు తెలిపారు. సమాచారం కోసం ఎవరైనా వస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఉత్కంఠ భరితం..



సమావేశం ముగిసిన అనంతరం బయటకు వస్తున్న చైర్మన్

5వ పేజీ తరువాయి

ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతి స్పందిస్తూ ప్రస్తుతం జరిగిన సమావేశానికి సంబంధించిన మినిట్స్‌ను కలెక్టర్‌కు అందజేస్తామని ఆతర్వాత కలెక్టర్ సూచించిన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతానికి కోరం లేకపోవడంతో సభలో ముగిస్తున్నట్లు ఆమె తెలిపారు.

హాజరైన కౌన్సిలర్లు వీరే...

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గానికి చెందిన కౌన్సిలర్లు మొల్ల మహబూబ్ రబ్బాని(వైస్ చైర్మన్), కాటేపోగు చిన్నరాజు, మొల్ల జాకీర్ హుస్సేన్, బోయ జయమ్మ, షేక్ రేష్మా, దేశెట్టి సుమలత, యం.కరిష్మా, జి.భాస్కర్‌రెడ్డి, కొండారెడ్డి విజయమ్మ, పాతకోట శాంతకుమారి, మన పాడు అశోక్, కొండేజు కృష్ణవేణి, ఉండవల్లి ధర్మారెడ్డి, గుర్రాల లక్ష్మీదేవి, ఎం.వాణి, కోఆప్షన్ మెంబర్ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఎంపీ వర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్, కోఆప్షన్ సభ్యుడు యస్.అబ్దుల్ గఫ్ఫార్ మాత్రమే హాజరయ్యారు. ఎంపీ వర్గానికి చెందిన మిగిలిన 9 మంది కౌన్సిలర్లు, వైసీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడం అవిశ్వాస తీర్మాణ సభ జరగకుండానే సమావేశం ముగిసింది.

మరో అవకాశమివ్వాలి: ఎమ్మెల్యే జయసూర్య

ప్రస్తుతం జరిగిన అవిశ్వాస తీర్మాన సభకు తనతో పాటు 15మంది కౌన్సిలర్లు హాజరయ్యారని, వారంతా టీడీపీకి చెందిన వారేనని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. కోరం 20మంది లేకపోవడంతో సభను ఫలితం తేలకుండా ముగించారని, తునిలో జరిగిన విధంగా మరో సారి అవిశ్వాస తీర్మానానికి అవకాశం కల్పించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్ నాగజ్యోతిని కోరినట్లు ఎమ్మెల్యే జయసూర్య తెలిపారు. మరోసారి అవకాశం ప్రవేశపెట్టేందుకు మున్సిపల్ చట్టంలో ఉందని, వాటిని పరిశీలించి అవిశ్వాస తీర్మానానికి మరోమారు అవకాశం కల్పించాలని కోరారు.

బాణసంచా పేల్చి..

మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాన సభ కోరంలేక ముగియడంతో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వర్గీయులు పటేల్ సెంటర్‌లో బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కౌన్సిలర్ చాంద్ బాషా, సత్యనారాయణ, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ మహేష్‌నాయుడు, పల్లె రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పటేల్ సెంటర్‌లో బాణసంచా కాల్చుతున్న ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయులు

రైలు ఢీకొని రైతు మృతి

ఆదోని, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణేకల్లు గ్రామానికి చెందిన రైతు బంగారయ్య (35) పొలానికి వెళుతూ రైల్వే గేటు దాటేక్రమంలో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల మేరకు.. గురువారం ఇస్వీ కుప్పగల్లు రైల్వే స్టేషన్‌ల మధ్య 523/23-24 కి.మీ. వద్ద ట్రాక్ ప్రక్కన తన పొలంలో కనకాంబరాల పంటకు నీళ్ల కట్టడానికి తెల్లవారు జామున ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య తాయమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని..

- యువతి బలవనర్మణం

కర్నూలు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపం చెంది ఓ యువతి ఉరేసుకొని బలవనర్మణానికి పాల్పడినట్లు సీఐ మధుసూదన్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన సుభాషిణి (22) అనే యువతి గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సుభాషిణికి వారం క్రితం నిశ్చితార్థమైంది. కొద్ది కాలంగా అమీలియో హాస్పిటల్‌లో నర్సుగా పనిచేస్తుంది. గురువారం ఇంట్లో ఉరివేసుకోగా.. తల్లిదండ్రులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని, మనస్తాపానికి గురైన సుభాషిణి ఈ ఆత్మహత్యకు పాల్పడింది. ఆత్మహత్య చేసకునే ముందు తన మిత్రుడు ఆదేశ్‌కు వీడియో కాల్‌చేసి మాట్లాడినట్లుగా పోలీసు విచారణలో తేలింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లి కావడం లేదని..

- రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మహానంది, మే 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. వివరాలు.. మండలంలోని గాజులపల్లికి చెందిన కొత్తూరు ఖలీల్(30) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. 30ఏళ్లు దాటినా పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం గుంటూరు- గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలిని రైల్వే పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జంట హత్యల కేసులో 11 మందికి జీవిత ఖైదు



పోలీసు బందోబస్తు మధ్య జైలుకు తరలుతున్న నిందితులు



విచారంతో జైలుకు తరలుతున్న నిందితులు

- చెరుకులపాడు నారాయణ రెడ్డి హత్యకేసు..
- నిర్దోషులుగా ఐదుగురు
- రోదనలతో మిన్నంటిన కోర్టు ఆవరణం
- హత్య జరిగిన 8 ఏళ్లకు శిక్ష ఖరారు
- కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పు

కర్నూలు లీగల్/కర్నూలు, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల నాటి జంట హత్యల కేసులో కర్నూలు జిల్లా కోర్టు సంచలన తీర్పునిచ్చింది. వైసీపీ నాయకుడు, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి భర్త కంగాటి లక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ చెరుకులపాడు నారాయణరెడ్డి, అతని అనుచరుడు బోయ సాంబశివుడుల జంట హత్యల కేసులో 11 మంది నిందితులపై జీవిత ఖైదు, రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపుల్స్ సెషన్స్ న్యాయాధికారి జి.కబర్ది గురువారం సంచలన తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు హత్య జరిగిన 2017 మే 21వ తేదీన చెరుకు లపాడు నారాయణ రెడ్డి తన అనుచరులతో కలిసి వెల్దుర్తి మండలం పోసానిపల్లిలో ఒక పెళ్లికి హాజరై ఆ తర్వాత రామకృష్ణాపురంలో మరో పెళ్లికి హాజరయ్యేందుకు తన అనుచ రులతో కలిసి రెండు వాహనాల్లో బయలు దేరారు. నారాయణరెడ్డి వాహనం క్రిష్ణగిరి రోడ్డులోని ఓ కల్వర్టు దగ్గర చేరుకుని, కల్వర్టు రిపేరి ఉండటంతో తమ ఫార్చునర్ కారును నెమ్మదిగా పోనిస్తుండగా.. కాపుకాచిన నిందితులు పక్క పొలాల నుంచి రెండు ట్రాక్టర్లతో వచ్చి నారాయణరెడ్డి కారును వెనుక వైపు నుంచి, ముందు వైపు నుంచి ఢీకొట్టాయి. దీంతో కారు నుజ్జయి ఆగిపోయింది. పారిపోవడానికి యత్నించిన నారాయణరెడ్డిని మిగతా నిందితులు కారులో నుంచి బయటకు లాగారు.

అనంతరం నిందితులు కొడవళ్లు, కత్తులు, నాటు బాంబులతో దాడి చేయడంతో నారాయణరెడ్డి తీవ్రంగా గాయపడి కిందపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న ఆయన తలపై నిందితులు పెద్ద బండరాయిని వేయడంతో అక్కడే మృతిచెందాడు. అదే కారులో ప్రయాణిస్తున్న అనుచరుడు బోయ సాంబశివుడును కూడా నిందితులు మారణాయుధాలతో అక్కడే హత్యచేశారు. నారాయణరెడ్డి కారు డ్రైవర్ గొల్ల కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కృష్ణగిరి పోలీసులు కేసు నమోదు చేసి 19 మంది నిందితులపై కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. చార్జ్‌షీటులో నిందితులుగా ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకురాలు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పేర్లను కూడా చేర్చడంతో వారు ఉన్నత కోర్టులను ఆశ్రయించడంతో కోర్టు వారి ఇద్దరి పేర్లను కేసు నుంచి తొలగించింది. దీంతో మొత్తం 16 మందిపై కేసు విచారణ జరిగి... 29 మంది సాక్షులను కోర్టు విచారించింది.

ఏ4 నిందితుడు ఆంజనేయులు మృతి

కేసు విచారణ జరుగుతుండగానే ఏ4 నిందితుడు కోతుల ఆంజనేయులు మృతి చెందాడు. మిగిలిన 11 మంది నిందితులు కురువ రామాంజనేయులు, రామనాయుడు, కురువ రామకృష్ణ, కోతుల బాలు, కోతుల చిన్న ఎల్లప్ప, కోతుల పెద్ద ఎల్లప్ప, గంటల వెంకట్రాముడు, గంటల శ్రీను, బీసన్నగారి రామాంజనేయులు, లక్ష్మన్న కుమారుడు రామాంజనేయులు, బీసన్నగారి పెద్ద బీసన్నలపై కోర్టులో నేరం రుజువు కావడంతో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఎం.వెంకటరెడ్డి వాదనలు వినిపించారు.

కోర్టులో మిన్నంటిన రోదనలు

చెరుకులపాడు నారాయణరెడ్డి జంట హత్య కేసులో 11 మంది నిందితులపై జీవిత ఖైదు శిక్ష పడిందని తెలియడంతో ఒక్కసారిగా కోర్టు ఆవరణం వారి బంధువులు, కుటుంబీకుల రోదనలతో మార్మోగింది. గురువారం ఉదయం నుంచే నిందితుల కుటుంబ సభ్యులు, బంధువులు, పిల్లలు జిల్లా కోర్టుకు రావడంతో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. జీవిత ఖైదు పడిన వారిని పోలీసులు వాహనంలోకి ఎక్కిస్తుండగా.. ఒక్కసారిగా వారి భార్య పిల్లలు వారిని చూసి ఆక్రందనలు చేస్తూ పోలీసు వాహనానికి ఎదురొచ్చారు. దీంతో ఎస్కార్ట్ పోలీసులు చొరవ చూసుకుని వాహనం వెళ్లేందుకు చర్యలు తీసుకోవడంతో నిందితులను పోలీసులు కర్నూలు జైలుకు తరలించారు. శుక్రవారం కడప సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

చెరుకులపాడులో భారీ బందోబస్తు



పోలీసుల పహారాలో చెరుకులపాడు గ్రామం

పత్తికొండ/ వెల్దుర్తి, మే 8(ఆంధ్రజ్యోతి): నారాయణరెడ్డి హత్యకేసులో కోర్టు 11 మందికి శిక్ష ఖరారు చేసిన నేపథ్యంలో చెరుకులపాడు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పర్య వేక్షణలో సీఐ మధుసూదనరావు, ఎస్ఐ అశోక్ రిజర్వ్‌డ్ పోలీస్ బలగాలతో పహారా కాస్తున్నారు. వెల్దుర్తి, కోసనపల్లి, రామళ్లకోట, గోవర్ధనగిరి, క్రిష్ణగిరి మండలం లోని తొగర్చేడు, కంబాలపాడు, చిట్యాల, క్రిష్ణగిరి గ్రామాల్లో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం : మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి



నా భర్త నారాయణరెడ్డి హత్యకేసుకు సంబంధించి కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా.. 2017లో నారాయణరెడ్డిని దారుణంగా హత్యచేశారు. హంతకులకు చట్టపరంగా శిక్ష పడాలని న్యాయస్థానాన్ని నమ్ముకున్నాం. ఎనిమిదేళ్ల విచారణ అనంతరం 11 మందికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడం హర్షిస్తున్నాం. ఈ తీర్పుతో కక్షలు, కార్పణ్యాలు పాల్పడే వారికి గుణపాఠంగా స్వాగతిస్తున్నాం. ఈ తీర్పు భవిష్యత్తులో హత్యలు పాల్పడే వారికి భయానికి గురిచేస్తుంది. న్యాయం జరిగింది.

కుంగిన టన్నెల్

- జాతీయ రహదారిపై పెద్ద గుంత
- హైవేపై స్తంభించిన ట్రాఫిక్
- కిలోమీటర్ల మేర ఆగిన వాహనాలు
- కార్మికులకు తప్పిన ప్రమాదం
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు




జాతీయ రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి

కర్నూలు క్రైం/రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- బెంగళూరు జాతీయ రహదారిపై రింగ్ రోడ్డు సమీపంలో చెన్నై-సూరత్ హైవే పనుల కోసం చేపట్టిన టన్నెల్ కొంత భాగం కుంగిపోయింది. దీంతో బెంగళూరు జాతీయ రహదారిపైన పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ఆ మార్గంలో వాహనాలను అనుమతించకపోవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్ స్థంభించింది. వివరాలోకి వెళితే చెన్నై-సూరత్ హైవే కర్నూలు మీదుగా వెళ్తుంది. కర్నూలు నగర శివారులో దూపాడు సమీపంలో బెంగళూరు జాతీయ రహదారిని చెన్నై-సూరత్ హైవే క్రాస్ చేస్తుంది. ఈమార్గంలో జాతీయ రహదారితో పాటు రైల్వే ట్రాక్ ఉండటంతో పైవంతెన మార్గం కాకుండా భూగర్భంలో టన్నెల్ నిర్మాణం చేపట్టింది. ఈహైవే నిర్మాణ పనులు మెగా ఇంజనీరింగ్ కంపెనీ చేపడుతుంది. సుమారు 1.2 కిలో మీటర్ల పొడవు, 18 మీటర్ల వెడల్పుతో 20మీటర్ల లోతులో ఈటన్నెల్ నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి రైల్వే ట్రాక్ దాటి జగన్నాథగట్టు వద్ద పైనుంచి వచ్చి రింగ్‌రోడ్డు జాతీయ రహదారిలో కలుస్తుంది. సుమారు 700మీటర్ల మేర టన్నెల్ నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం జాతీయ రహదారి కింది భాగంలో 20 మీటర్ల లోతులో పనులు జరుగుతున్నాయి. ఈ పనులు చేపట్టే క్రమంలో కొంత భాగం ఉన్నట్టుండి కూలిపోయింది. కింద పనిచేసే కార్మికులకు ఎవరికీ ప్రాణనష్టం జరగలేదు. 20 మీటర్ల లోతులో పెద్ద గోతి ఏర్పడింది. జాతీయ రహదారిపైన సుమారు 200 మీటర్లు పొడవు ఉండటంతో అక్కడ కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన మెగా ఇంజనీరింగ్ కంపెనీ సిబ్బంది ట్రాఫిక్‌ను డైవర్ట్ చేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కర్నూలు తాలుకా, ఉలిందకొండ, ట్రాఫిక్ పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వన్‌వేలోనే మళ్లించడంతో..

అటు బెంగళూరు నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి బెంగళూరు వైపునకు, కర్నూలు నుంచి రింగ్ రోడ్డు మీదుగా నంద్యాల, కడప వెళ్లే వాహనాలను కేవలం వన్‌వేలోనే మళ్లించడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. రింగ్ రోడ్డుపైన సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆ రింగ్ రోడ్డు కూడా టన్నెల్ కూడా ఉండటంతో ఒకేసారి అన్ని వాహనాలు అనుమతించడంతో ఈ సమస్య మరింత తీవ్రమైంది. ప్రమాదం జరిగిన వెంటనే కాంట్రాక్టు సంస్థ సిబ్బంది వెంటనే మరమ్మతుల పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు పనులు జరిగాయి. దీంతో అనంతపురం నుంచి కర్నూలు వచ్చే ఆర్టీసీ బస్సులు, వాహనాలు, ఆటోల్లో వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడ ఏం జరుగుతుందో తెలియక ఆందోళనకు గురయ్యారు..



ఒకే వరుస దారిలో వెళ్తున్న భారీ వాహనాలు

అత్యుత్తమ సేవలకు పురస్కారం



ఉత్తమ సేవలందించినందుకు గాను కలెక్టర్ రంజిత్ బాషాకు గవర్నర్ అబ్దుల్ నజీర్ విజయవాడలో అవార్డు అందజేశారు. - కర్నూలు కలెక్టరేట్

ఈతకెళ్లి వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బాలలు మృతి

ఎమ్మిగనూరు/ ఎమ్మిగనూరు రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఈతకెళ్లి నీటమునిగి వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు ముగ్గురు బాలురు దుర్మరణం పాలయ్యారు. పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీకి చెందిన రోహన్(10) మండలంలోని రాళ్లదొడ్డికి చెందిన శీను(14), నందవరం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన అనూక్(13) ఈతకెళ్లి మృతిచెందారు. స్థానికులు, బాధిత కుటుంబాలు తెలిపిన వివరాలు.. ఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటున్న ప్రైవేటు టీచర్ శిరో మణి కుమారుడు రోహాన్ నాలుగో తరగతి చదువుతున్నాడు. మానసికస్థితి సరిగాలేదు. సెలవులు కావటంతో ఎల్లెల్సీ కాలువ దగ్గరకు వెళ్లాడు. కాలువలో నీటిలో తును గమనించకుండా ఈతకొట్టేందుకు కాలువలోకి దిగి నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాడు. మండలంలోని రాళ్ల దొడ్డికి చెందిన రామకృష్ణ కుమారుడు శీను సరదాగా ఈతకోసం గ్రామసమీపంలో ఉన్న నీటికుంటకు వెళ్లాడు. నీటిలోకి దిగి ఈత కొడుతుండగా ఫిట్స్ వచ్చి నీటిలోనే మునిగిపోయాడు. ఎంత సేపటికి బయటకు రాలేదు. స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని నీటికుంటలో పడిపోయిన శ్రీనును వెతికి బయటకు తీశారు. అప్పటికే మృతిచెంది ఉండటంతో మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. నందవరం మండలం సంజీవపురానికి చెందిన అనూక్ తుంగభద్ర నదిలోకి ఈతకెళ్లాడు. నదిలో గుంతలో దిగి ఈతకొట్టేందుకు ప్రయత్నించాడు. ఈత రాకపోవడం, గుంత లోతుగా ఉండటంతో నీటిలో మునిగి ఊపిరాడక మరణించాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు అనూక్‌ను బయటికి తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

మూడు ప్రభుత్వ క్వార్టర్స్ వేలం

కర్నూలు లీగల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్ సమీపంలో జాతీయ రహదారి కోసం ప్రభుత్వం సేకరించిన భూమికి నష్టపరిహారం చెల్లించనందుకు కర్నూలు సీ.క్యాంపులోని మూడు ప్రభుత్వ క్వార్టర్స్‌ను కర్నూలు జిల్లా కోర్టు గురువారం వేలం వేసింది. 2008లో ముగ్గురు బాధితులకు చెందిన భూములను ప్రభుత్వం జాతీయ రహదారిని నిర్మించేందుకు సేకరించింది. డోన్‌కు చెందిన విజయలక్ష్మి, సేగు ఆంజనేయులు, చిన్న సుబ్బారావుకు చెందిన భూమిని అప్పట్లో ప్రభుత్వం సేకరించి నష్టపరిహారాన్ని కూడా నిర్ణయించింది. ఆ నష్టపరిహారం తగినంత లేదని, మార్కెట్ వాల్యూ కంటే తక్కువగా ఉందని ఈ ముగ్గురు బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఒక ఎకరాకు రూ.6,42,500 ఇవ్వాలని ప్రభుత్వానికి 2019లో ఆదేశించింది. అయినా కూడా ప్రభుత్వం ఆ నష్టపరిహారాన్ని చెల్లించకపోవడంతో బాధితులు తిరిగి కోర్టును ఆశ్రయించి స్థానిక బీ.క్యాంపులోని మూడు ప్రభుత్వ క్వార్టర్లను వేలం వేసి నష్టపరిహారం ఇప్పించాల్సిందిగా కోర్టును కోరారు. ఈ మేరకు కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది ఆధ్వ ర్యంలో జిల్లా కోర్టులో వేలం పాట జరిగింది. వేలం పాటలో విజయలక్ష్మి తనకు రావాల్సిన నష్టపరిహారం రాబట్టుకునేందుకు వేలం పాటలో పాల్గొని క్వార్టర్స్ నెంబర్. బీ/బీ19ని, సేగు ఆంజనేయులు బీ/సీ6 క్వార్టర్‌ను వేలం పాటలో దక్కించుకు న్నారు. కాగా చిన్న సుబ్బారావు తరుపున మూడో వ్యక్తి బీ/బీ18 క్వార్టర్‌ను వేలం పాటలో దక్కించుకున్నాడు. దీంతో తదుపరి ప్రొసిడీంగ్స్‌ను నిర్వహించేందుకు కోర్టు కేసులను వాయిదా వేసింది.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు: ఈవో

బనగానపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూముల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రూప్ టెంపుల్ ఈవో బ్రహ్మానందారెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని పలుకూరు గ్రామంలోని 308 సర్వే నెంబర్‌లో రామేశ్వర స్వామి మాన్యం 4 ఎకరాల్లో అక్రమంగా మైనింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో గని దగ్గరకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ గనిలో చాకలి పక్కీర, చిలకల లక్ష్మయ్య, కిరణ్‌లు అక్రమ మైనింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ పూజరి భాస్కరయ్య పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ

బనగానపల్లె, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్‌హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.లలిత గురువారం తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఏదైనా డిగ్రీ లేదా బీటెక్ చదివిన వారు అర్హులన్నారు. వివరాలకు 9705998056 నంబరును సంప్ర దించాలని సూచించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


కోవెలకుంట్లలో వాసవీ కన్యకాపరమేశ్వరికి పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ, టంగుటూరు సీనయ్య

కోవెలకుంట్ల, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఐదో రోజు గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి సతీమణి ఇందిరమ్మ, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టంగుటూరి సీనయ్యలు హాజరయ్యారు. అనంతరం వారు అమ్మవారి ఆలయానికి చేరుకొని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఇందిరమ్మ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషలతో ఉండాలని అమ్మవారికి మొక్కున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి బీసీ గెలుపునకు కృషి చేసిన యువనాయకుడు కర్నాటి అభిలాష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం, యువజన సంఘం నాయకుడు కర్నాటి అభివాస్, నాగరాజు, శివనాగయ్య, నాగేశ్వరరావు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వజ్రోత్సవ వేడుకలు: కోవెలకుంట్ల పట్టణంలో ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమైన వాసవీమాత వజ్రోత్సవ వేడుకలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం మహా పూర్ణాహుతి జరిగింది. కుంబాభిషేకంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

దక్షిణామూర్తికి పంచలోహ మకర తోరణం వితరణ

కొలిమిగుండ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె సమీపంలోని గుండం అంజనేయస్వామి ఆలయం వద్ద ఇటీవల నిర్మించిన నూతన గురు దక్షిణామూర్తి ఆల యానికి దాతలు గురువారం పంచలోహ మకర తోరణం వితరణంగా అందించారు. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బాలదస్తగిరి కుటుంబ సభ్యులు రూ.30వేలకు పైగా నిధులు వెచ్చించి స్వామి వారికి పంచలోహ మకర తోరణం తయారు చేయించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మకర తోరణం అందించగా, స్వామికి అంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉమామహేశ్వర స్వామికి పూజలు


శివాలయం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఉయ్యాలవాడ, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామంలో గురువారం ఉమామహేశ్వర స్వామి పునఃప్రతిష్ఠ ఉత్సవా లు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు దక్షిణామూర్తి ఆధ్వర్యంలో మొదటి రోజు ఉదయం 7 గంటలకు గోపూజ, గంగానయనం, గణాధిపతి పూజ, యంత్రార్చన, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠాపనం, శాంతి హోమం చేశారు. గ్రామ సర్పంచ్ దంపతులు చామల ఉమా దేవి, చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శ్రీనివాస బృందం వారు శివకీర్తలను పాడారు. రాత్రి భజన పోటీలు నిర్వహిం చారు. ఈవేడుకలకు శుక్రవారం శృంగేరి శివగంగా పీఠాధిపతి పురుషో త్తమ భారతీ రానున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అదేవి ధంగా ఒంగోలు జాతి ఎద్దుల న్యూ క్యాటగిరీ విభాగంలో బండ లాగు డు పోటీలు శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

వీవోఏలను తొలగించడం తగదు

బేతంచెర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంట్ నగర్‌లో రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఎటువంటి సమాచారం లేకుండా వీవోఏలను తొలగించడం తగదని సీఐ టీయూ జిల్లా ఉపాధ్యక్షులు వై.ఎల్లయ్య అన్నారు. గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాల యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం సీఐటీయూ మండల నాయకు లు వైబీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎలయ్య వైబీ వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, సంజీవ నాయుడు, హరిప్ర సాద్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరుద్యోగులపై కక్ష సాధింపులు అధికమయ్యాయని అన్నారు. ఈసమావేశంలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్ రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిగురుమాను పేటకు చెందిన పవర్ ప్లే మోహన్ రెడ్డి తల్లి మృతికి టీడీపీ నాయకుడు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. గురువారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు.


నివాళులర్పిస్తున్న ధర్మవరం గౌతమ్ రెడ్డి

తూకాలపై వినియోగదారులకు అవగాహన

డోన్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): తూకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని లీగల్ మెట్రాలజీ తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుస్సేన్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. గురువారం సాయంత్రం డోన్ కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు దారులకు తూకాలపై అవగాహన కల్పించారు. వినియోగదారుల సంఘం నాయకులు సాదనగిరి రామకృష్ణారెడ్డి, లీగల్ మెట్రాలజీ టెక్నికల్ అసిస్టెంట్ హనుమాన్ సింగ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఫజూల్ రెహమాన్

అధికారులకు మొరపెట్టుకున్న ప్రజాప్రతినిధులు

బేతంచెర్ల, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై అధికా రులు దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు అధికారులకు మొర పెట్టుకున్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగ భూషణం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఫజూల్ రెహమాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు సభాదృష్టికి తెచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి గోరుకల్లు రిజర్వాయరు నుంచి వాటర్ గ్రిడ్ ద్వారా పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోరుమానుకొండ సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో ఏడబ్ల్యూ భూములలో పలువురు పొలాలు సాగు చేసుకున్నందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ఏడబ్ల్యూ భూములు సాగు చేయకుండా చర్యలు తీసుకోవా లని వీఆర్వో మద్దిలేటి స్వామిని ఆదేశించారు. అలాగే గూటుపల్లె గ్రామ సర్పంచ్ శ్రీరాములు మాట్లాడుతూ తమ గ్రామంలో మురికి నీరంతా నిల్వ చేసేందుకు ఇంకుడు గుంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ మాట్లాడుతూ మండలలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఇప్పటికే 23 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంఈవో సోమశేఖర్ మాట్లాడుతూ మండ లానికి అంబేడ్కర్ గురుకుల పాఠశాల మంజూరైందని, ఆ పాఠశాలకు ఏడబ్ల్యూ ల్యాండ్ తహసీల్దార్ ప్రకాష్‌బాబు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రభుత్వ ఆయా శాఖల అధికా రులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం


డోన్‌లో హెన్రీ డ్యూనాంట్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

డోన్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ డూనాల్ట్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, నాయకులు ఓంప్రకాష్, రవి, రెడ్‌క్రాస్ సభ్యులు కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, మహ్మద్ రఫీ తదితరులు ఉన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

డోన్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపేట గ్రామంలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఆరాధన ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో గ్రామ పెద్దలు, ధర్మకర్త సద్గురు రంగస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంతంలో గుండు ఎత్తు పోటీలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చెక్కభజన కార్యక్రమాలు అలరించాయి.

డీసీఎంఎస్ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకుడు

ప్యాపిలి, మే 8(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్‌ను గురువారం కర్నూలులోని ఆయన నివాసంలో మండలంలోని ఊటకొండ గ్రామంకు చెందిన టీడీపీ నాయకుడు ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ద్వారా రైతులకు మేలు జరిగేల చర్యలు తీసుకోవాలని చెర్మన్‌ను కోరినట్లు ప్రతాప్ తెలిపారు.

సాయిబాబా గ్రామోత్సవం

ప్యాపిలి, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం సాయిబాబా గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయం వార్షికోత్సవం సందర్భంగా ఈ ఉత్సన్ని నిర్వహించారు. అలాగే శుక్రవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చాగలమర్రి: గ్రామంలో సాయి పల్లకి ఉత్సవం గురువారం సాయి సేవకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జల, పాలాభిషేకాలు చేశారు. ప్రత్యేక హారతులతో సాయి వ్రతం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత జయంతి సందర్భంగా గురువారం రాత్రి వేద పండితుడు నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలతో లక్ష కుంకుమార్చన చేశారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీర్చి రథోత్సవం నిర్వహిం చారు. చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ధర్మకర్త లక్ష్మణబాబు, కార్యదర్శి నవతా ప్రసాద్, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ మహోత్సవం

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో


వెల్లాల క్షేత్రంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న వేద పండితులు

చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ధ్వజారోహన మహోత్సవాన్ని వేద పండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ సమీపంలోని కుందూనది జలాలను కళశాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి ధ్వజస్తంభం వద్ద జలాభిషేకం చేశారు. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఈవో వెంకటరమణ, రామ్మోహన్, మహిళలు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల్లో భాగంగా మండలంలో 146 మట్టి నమూనా శాంపిళ్లను సేకరించినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. గురువారం చాగలమర్రి గ్రామంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. క్యూఆర్ కోడ్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 17 రైతు సేవా కేంద్రాల పరిధిలో 932 మట్టి నమూనాలను సేకరించాల్సిన లక్ష్యంగా ఉందన్నారు. జొన్నలు విక్రయించుకునే రైతులు రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహాల పరిశీలన

డోన్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త ఇందిరానగర్‌లోని లబ్ధిదారుల గృహాలను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, హౌసింగ్ ఏఈ వీరేంద్ర, మున్సిపల్ ఏఈ సురేష్‌లు గురువారం పరిశీలించారు. పట్టణంలోని ఇందిరానగర్‌లో డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తి చేయాలని ఆ కాలనీ వాసులు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసేందుకు నెల రోజుల క్రితమే మెట్లను పగులకొట్టి వెళ్లారే తప్ప.. కాలువలు ఏర్పాటు చేయడంలో కాంట్రాక్టర్ ఇటువైపు చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువల నిర్మించేందుకు మెట్లు పగులకొట్టడంతో ఇటు, అటూ తిరిగేందుకు చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నామనీ తెలిపారు. కావున వెంటనే కాలువల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్‌ను కోరారు.

భారత సైన్యానికి అండగా ఉండాలి

టీడీపీ యువ నాయకుడు హనుమంతరెడ్డి



డోన్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ ఉగ్రవాదంపై జరిపే దాడిలో భారత సైన్యానికి అందరూ అండగా ఉండాలని డోన్ టీడీపీ యువ నాయకులు వై.హనుమంతరెడ్డి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రాంతంలోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం వ్యూహాత్మకమైన దాడులు చేయడం అభినందనీయమన్నారు. ప్రతీకార చర్యగా పాకిస్తాన్ తిరిగి భారతదేశంపై దాడులకు దిగినా వాటిని ఎదుర్కోవడానికి భారతీయులు కూడా సిద్ధంగా ఉంటారన్నారు. ఏ త్యాగానికైనా భారతీయులు సిద్ధం అన్నారు. పాకిస్తాన్‌పై జరిగే చివరి పోరాటంలో భారత్‌కు అంతిమ విజయం లభిస్తుందని దీమా వ్యక్తం చేశారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): డెంగీ, మలేరియా వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్‌యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి సూచించారు. గురువారం చాగలమర్రి కేజీబీవీ హాస్టల్‌లో ముందస్తుగా దోమల నివారణలో భాగంగా మందును పిచికారీ చేయించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమలు వృద్ధి చెందకుండా మందు పిచికారీ చేసినట్లు అధికారి తెలిపారు. 6 నెలల పాటు మందు ప్రభావం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వో సునీత, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది మనోహర్, రాముడు, గార్లెట్, లీలావతి, పుష్పలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదు'

కుష్టు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ అన్నారు. గురువారం మండలంలోని మద్దూరు, పెద్దవంగలి, చాగలమర్రి గ్రామాలకు చెందిన కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ప్రభుత్వంచే మంజూరైన ఎంసీఆర్ పాదరక్షలను పంపిణీ చేశారు. ఏడాదికి రెండు జతల ప్రకారం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వ్యాధి లక్షణాలు వారు కాళ్లకు పుండ్లు కాకుండా ఎంసీఆర్ పాదరక్షలను వాడితే మంచిదని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమయం వృథా చేసుకోవద్దు

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): సమయం ఎంతో విలువైందని, సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి రామచంద్రుడు విద్యార్థులకు సూచించారు. గురువారం గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులచే నీతి కథలను చెప్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపిస్తే విజ్ఞానం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులచే వివిధ ఆటలను నిర్వహించారు.

రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోండి

చాగలమర్రి, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారిద్రరేఖకు దిగువన ఉన్న అర్హతగల కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ గురువారం సూచించారు. అలాగే రేషన్ కార్డులో పేర్లను తొలగించడం, పేర్లను చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకే కుటుంబంలో నూతనంగా వివాహం చేసుకొని కొత్తగా ఏర్పడిన వారు, చిరునామ మారిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నమోదు చేసుకోవాలన్నారు.

అంగరంగ వైభవంగా వాసంతిక పరిణయోత్సవం

స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నరసింహస్వామి జయంతి బ్రహోత్సవాలలో భాగంగా గురువారం వాసంతిక పరిణయోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ మాధవన్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ స్వామి, మణియర్ సౌమ్య నారాయణన్ అభిషేకాలు, నవకళశ తిరుమంజనం నిర్వహించారు. వాసంతిక పరిణయోత్సవం(తిరు కళ్యాణం)లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణానికి వచ్చిన చెంచు మహిళలకు దేవస్థానం తరుపున వస్త్రాలు అందజేశారు. అనంతరం స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి ని పల్లకిలో కొలువు దీర్చి మాడా వీధులలో ఊరేగింపు నిర్వహించారు. నరసింహ స్వామి జయంతి మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


గజవాహనంలో కొలువైన నరసింహ స్వామి


చెంచులకు వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

శిరివెళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఇంద్రావతి సూచించారు. ఇందుకు సంబం ధించిన కరపత్రాలను ప్రిన్సిపాల్, అధ్యాపకులు గురువారం విడుదల చేశారు. ఇంటర్మీడియట్, ఆపైన చదువుకున్న విద్యార్థులకు వెబ్ డెవ లపర్, ఎంఐఎస్ డేటా అనలిస్ట్ కోర్సులలో శిక్షణ ఇస్తామన్నారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో కూడిన సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రుద్రవరం మే 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. వివరాలు.. మండలంలోని నరసాపురం గ్రామ సమీపంలో బుధవారం రాత్రి వరి గడ్డి ట్రాక్టర్ జీపు ఢీ కొన్న ఘటనలో అహోబిలానికి చెందిన సుబ్బరాయుడు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆళ్లగడ్డ నుంచి అహోబిలం వెళ్తున్న జీపు అహోబిలం నుంచి నరసాపురం వస్తున్నగడ్డి ట్రాక్టర్ నర సాపురం గ్రామ సమీపంలోని కుంట వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని పోలీసులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక గురువారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు నరసింహఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రుద్రవరం మే 8 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిత్తరేణి పల్లె గ్రామంలో పట్టాభిరామ స్వామి దేవాలయం, ధ్వజస్తభంతో పాటు సీతా రామ లక్ష్మణ హనుమాన్ సమేత విగ్రహాలు ప్రతిష్ఠ గురు వారం కన్నులపండువలా నిర్వహించారు. చుట్ట పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామోత్సవం నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రుద్రవరం మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవాగు పల్లె గ్రామంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ సహకారంతో కొత్తగా తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసినట్లు గురువారం టీడీపీ నాయకులు పార్థసారధి రెడ్డి, జయ ప్రతాపరెడ్డి తెలిపారు. పథకాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆమె వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయటంతో కొత్త బోరు బిగించి మోటారు ఏర్పాటు చేసిట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హుసేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.


నవాబుపల్లెలో తాగునీటి పథకం వద్ద టీడీపీ నాయకులు

మద్యం స్వాధీనం

బనగానపల్లె, మే 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం గ్రామంలో కర్ణాటక మద్యం అమ్ముతున్న పాణ్యం చెన్నకేశవరెడ్డి, బాల వెంకటేశ్వర్లు నుంచి 48 లీటర్ల కర్ణాటక టెట్రా పాకెట్లు, అలాగే 12 బ్రాందీ సీసాల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్దనాదేవి, ఎస్ఐ కరుణాకర్ గురువారం తెలిపారు. దాడులు చేసి మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే బనగానపల్లె పట్టణంలో నాగలక్ష్మి, మల్లికార్జున నుంచి సారా స్వాధీనం చేసుకని ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో సారా అమ్ముతున్న హనుమా నాయక్ వద్ద సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరపరిచినట్లు వారు తెలిపారు. నంద్యాల టీం, కోవెల కుంట్ల టీంలు సంయుక్తంగా దాడులు చేసినట్లు వారు తెలిపారు.

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాసి గ్రామంలో బెల్ట్ షాపుపై దాడి నిర్వహించి 44 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు కోవెల కుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం బెల్ట్ షాపుపై దాడిచేసి గ్రామానికి చెందిన శ్రీనివాసులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. నలుగురిపై కేసు

బేతంచెర్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన ఆలమూరు గోపి అనే వ్యక్తిపై సాయి మరో ముగ్గురితో కలిసి తలపై రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపరిచాడని హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి గురువారం తెలిపారు. వివరాలివీ.. దుర్గాపేటకు చెందిన సాయి ఇదే కాలనీకి చెందిన ఆలమూరు గోపిని గత రాత్రి క్రాస్ రోడ్డులో సాయి, శివ, మహేష్, మధులు కలిసి ఇనుపరాడ్డుతో తలపై కొట్టి గాయపరిచారని తెలిపారు. పాత కక్షలే కారణమని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాయి, మరో ముగ్గురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డోర్లకు నిప్పు.. నలుగురిపై కేసు

పట్టణంలోని దుర్గాపేటకు చెందిన మద్దయ్య అనే వ్యక్తి ఇంటి డోర్లపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు గురువారం తెలిపారు. అదే కాలనీకి చెందిన మద్దయ్యకు సాయిల మధ్య పాతకక్షలు ఉండటంతో గూటం సాయి మనసులో పెట్టుకుని మద్దయ్య డోర్లను పెట్రోల్ పోసి నిప్పంటించగా రూ.30వేలు నష్టం వాటిల్లిందని మద్దయ్య ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

మాజీ మంత్రి బుగ్గన


పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

డోన్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సహకరించి అభివృద్ధి పనులను పూర్తి చేసి ఎంతో మందికి ఉపయోగపడే విదంగా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన మండలంలోని కొత్తకోట గ్రామం వద్ద ఐడీటీఆర్ డ్రైవింగ్ స్కూల్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం పనులు పూర్తి అయితే ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. మురళీధర్ రెడ్డి సతీమణి అనారోగ్యంతో ఉండటంతో వారి ఇంటికి వెళ్లి బుగ్గన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బుగ్గన వెంట ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మాజీ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, జడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్ యాదవ్, వైసీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

యువతి మృతి

డోన్ టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమీపంలో చిన్నారి (19) మృతి చెందింది. వివరాలివీ.. కోడుమూరు మండలంలోని లద్దగిరి గ్రామానికి చెందిన చిన్నారి గత మూడు నెలల క్రితం కురువ ఎల్లప్పతో వివాహం జరిగింది. చిన్నారి ప్రస్తుతం గర్భిణి. ఇంట్లో ఉరివేసుకొని ఉంది. అయితే చిన్నారి భర్తనే దాడి చేసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని అర్బన్ సీఐ ఇంతియాజ్ బాషా తెలిపారు.

'ఆపరేషన్ సిందూర్'పై హర్షం

డోన్ టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కశ్మీర్‌లో పహల్‌గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి పారిశ్రామికవేత్త మహేష్‌కన్నా, సాత్విక్, ఈశ్వర్, న్యాయవాది శ్యాంసుందర్, సూర్తి సేవా సమితి సభ్యులు మధు నివాళి అర్పించారు. అలాగే ఆపరేషన్ సిందూర్‌పై హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం పట్టణంలోని సమ్మెక్యాంద్ర కట్ట వద్ద హిందూ, ముస్లిం బాయ్ బాయ్ అంటూ నినాదాలు చేశారు. జాని ప్రభాకర్, గుల్షన్, కరుణానిధి, మధు, హయత్ మహమూద్ ఖాదర్‌వలి, చరణ్, మద్దిలేటి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.